# Eenadu

# కొత్త జిల్లాలకు 3,252 పోస్టులు

- ఖాళీలు పెరిగే అవకాశం
- పదోన్నతుల ద్వారా కొన్నింటి భర్తీ
- దసరా తర్వాత కొత్త నియామకాల ప్రక్రియ
- తొలిరోజు నుంచే పూర్తిస్థాయి పాలన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా అమలులోకి వచ్చే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల కోసం 3,252 ఉద్యోగ నియామకాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. కొత్త కలెక్టరేట్లు, పలుశాఖల్లో పరిపాలన విభాగాల అధికారులు, ఉద్యోగుల పోస్టులను ప్రాథమికంగా అంచనా వేసింది. ఇవిగాక పోస్టుల సంఖ్య ఇంకా పెరుగుతుందనీ భావిస్తోంది. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం ఈ నియామకాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయన కార్యాలయ అదనపు ముఖ్యకార్యదర్శి శాంతికుమారి బుధవారం సచివాలయంలో కొత్త జిల్లాల్లో ఉద్యోగ నియామకాలు, పరిపాలన అంశాలపై చర్చించారు. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలకు కేడర్ పోస్టులు (మిగతా 2లో)



# కొత్త జిల్లాలకు 3,252 పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

కావాలని రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య, పురపాలన, పరిశ్రమలు తదితర శాఖల ఉన్నతాధికారులు నివేదించారు. ప్రతీ కేడర్‌లో ఉద్యోగ నియామకాలు అనివార్యమని పేర్కొన్నారు. అధికారుల అంచనాల మేరకు.. సత్వరమే 3,252 పోస్టులు కావాలని నిర్ణయించారు. కలెక్టరేట్లలో పరిపాలన విభాగాలు, వివిధ శాఖల్లోని అధికారులు, సిబ్బంది పోస్టులు ఇందులో ఉన్నాయి. పోస్టుల్లో ఎక్కువ రెవెన్యూ, పోలీసు శాఖలవే! ఇంకా అన్ని కేడర్లలో పోస్టుల అవసరం పెరుగుతుందని శాంతి కుమారికి అధికారులు వివరించారు. అర్హతల ఆధారంగా కొన్నిశాఖల్లో పదోన్నతులు కల్పించి పోస్టులను భర్తీ చేయాలని ఆయా శాఖల ఉన్నతాధికారులు కోరారు. అంతవరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఉద్యోగ అవసరాలపై సీఎంకు నివేదిక ఇస్తామని శాంతికుమారి తెలిపారు.

**పాలనకు సన్నద్ధం:** జిల్లాల పునర్ వ్యవస్థీకరణను ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారనీ, ఈ ప్రక్రియను విజయవంతంచేసే బాధ్యత అధికార యంత్రాంగానిదేనని శాంతికుమారి తెలిపారు. కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు ప్రారంభమైన తొలిరోజు నుంచే పూర్తిస్థాయిలో పనిచేసేలా సన్నాహాలు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. రెవెన్యూ, పోలీసు విభాగాలు కీలకమైనవని, కొత్త కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాల ద్వారా ఇందుకు ఏర్పాట్లు జరగాలన్నారు. కార్యాలయాల భవనాలు, మౌలిక వసతులు, ఇతర అంశాలపై ఆమె అధికారులతో చర్చించారు.